




నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

శుక్రవారం | 19 సెప్టెంబరు 2025

పేజీలు 8


## ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- ఎమ్మిగనూరులో ఉల్లి కొనుగోలు కేంద్రం ప్రారంభం
- రైతులు పక్వానికి వచ్చిన ఉల్లిని గ్రేడింగ్ చేసి మార్కెట్‌కి తీసుకుని రావాలి
- కర్నూలు ఇంఛార్జీ కలెక్టర్ డా.బి.నవ్య

2లో



రైతులు తెచ్చిన ఉల్లిని పరిశీలిస్తున్న ఇంచార్జ్ కలెక్టర్

## ఆశగా వచ్చారు..

- వర్షం కారణంగా నియామక పత్రాల పంపిణీ రద్దు
- బస్సులు లేక ఇబ్బందులు పడ్డ ప్రజలు
- ఆర్‌యూకు చేరుకున్న 6 వేల మంది

# నిరాశగా వెనుదిరిగారు..!



తిరుగు ప్రయాణానికి బస్సు కోసం ఇబ్బంది పడుతున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** డిఎస్‌సి పరీక్షలు రాశాము..నేడు ముఖ్యమంత్రితో నియామక పత్రాలు అందుకుంటామని.. ఎంతో ఆశగా ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా 2590మంది అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలు నగరంలోని రాయలసీమ యూనివర్సిటీకి చేరుకున్నారు. ప్రయాణానికి సంబంధించి విద్యాశాఖ అధికారులు జిల్లా నుండి విజయవాడకు అభ్యర్థులను తీసుకెళ్లేందుకు 134బస్సులను సైతం ఏర్పాటు చేశారు. కాగా ముందస్తుగా గురువారం ఉదయం 8గంటలలోగా అభ్యర్థులు ఆర్‌యు ప్రాంతానికి చేరుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో అభ్యర్థులు సమయాన్ని పాటిస్తూ హాజరయ్యారు. మరోవైపు కొందరు చంటిబిడ్డల తల్లులు, దివ్యాంగులు, సుదూర ప్రాంతాల నుండివచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. అయితే అధికారులు వచ్చిన అభ్యర్థులతో పాటు వారి

మిగతా 2లో



చంటిబిడ్డతో డిఎస్‌సి అభ్యర్థి



చిన్నారికి అల్పాహారం తినిపిస్తున్న సహాయకురాలు



సందిగ్ధంలో డిఎస్‌సి అభ్యర్థులు

## శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ గా రమేష్ నాయుడు

- అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన రమేష్ నాయుడు
- రమేష్ నాయుడు నియామకం పట్ల ఎంపీ బైరెడ్డి శబరి హర్షం



శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేష్ నాయుడు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్గా పోతుగుంట రమేష్ నాయుడు నియమితులయ్యారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు బోర్డు చైర్మన్గా పలువురిని కూటమి ప్రభుత్వం నియమించింది.

మిగతా 2లో


## వైభవంగా ఎమ్మెల్యే కోట్ల జన్మదిన వేడుకలు



2లో

కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న యువనేత కోట్ల రాఘవేంద్రారెడ్డి

## శ్రీశైలానికి భారీగా వరద..



2లో

7 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల దృశ్యం




# ఆశగా వచ్చారు..నిరాశగా వెనుదిరిగారు..!

(మొదటి పేజీ తరువాయి)

సహాయకులకు అల్పాహారాన్ని అందించారు. ఈ నేపథ్యంలో ఆంధ్రా ప్రాంతంలో భారీ వర్ష సూచనలో భాగంగా రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ జెసి నవ్యతో పాటు డిఈఓ శామ్యూల్ పాల్‌లు ప్రకటించడంతో ఒక్కసారిగా నిరాశగా అభ్యర్థులతో పాటు తమ వెంట వచ్చిన వారు వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. త్వరలో నియామక పత్రాలు అందించే తేదీ, సమయాన్ని ప్రకటిస్తామని వారు తెలిపారు.

**బస్సులు లేక ప్రజలు ఇబ్బంది :** ఉమ్మడి జిల్లాతో పాటు సత్యసాయి జిల్లా నుండి డిఎస్‌సి అభ్యర్థులను 134బస్సులలో విజయవాడకు తీసుకెళ్లేందుకు జిల్లా అధికారులను ఆర్టీసి బస్సులను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలు బస్టాండ్, మరికొన్ని పట్టణ



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న జెసి, డిఈఓ

ప్రాంతాల నుండి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు బస్సులు లేక ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండ ఆర్‌యు ప్రాంతం నుండి అధికారుల సూచన మేరకు అభ్యర్థులను వారు సూచించిన ప్రాంతాలకు చేరవేయడంలో కొంత విఫలమైనట్లు స్పష్టంగా కనబడింది.

# ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇంచార్జి కలెక్టర్ డా.బి.నవ్య

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** రైతులు పక్వానికి వచ్చిన ఉల్లిని గ్రేడింగ్ చేసి మార్కెట్ కి తీసుకుని రావాలని, ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఇంచార్జి కలెక్టర్ డా.బి.నవ్య పేర్కొన్నారు. గురువారం ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ లో ఉల్లి క్రయ విక్రయాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం సంబంధిత రైతులతో ఇంచార్జి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు మార్కెట్ యార్డ్ లో ఉల్లి స్టాక్ పాయింట్ ఎక్కవ ఉన్నందువలన రెండు రోజులు తాత్కాలికంగా ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ లో ఉల్లి క్రయ విక్రయాల నిర్వహణ జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ కు 18 మంది రైతులు 1500 క్వింటాల పైగా వరకు ఉల్లిని మార్కెట్ యార్డుకు తీసుకువచ్చారన్నారు. రైతులు పక్వానికి, వచ్చిన ఉల్లిని మాత్రమే గ్రేడింగ్ చేసి మార్కెట్ కి తీసుకుని రావాలన్నారు. రైతులు ఉల్లి పంట నాటిన 110 రోజుల తర్వాత పక్వానికి వచ్చిన తర్వాత కోత కోయాలని తక్కువ రోజుల్లో పంట కోత కోయడం ద్వార పంట సరిగ్గా ఉండదని, గిట్టుబాటు ధర సమస్యలు వస్తాయని తెలిపారు. అనంతరం మార్కెట్ యార్డ్ లో ఉల్లి పంటను తీసుకుని వచ్చిన రైతులతో ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ పంట సాగు, ఉత్పత్తి, అమ్మకాల వివరాల పై ఆరా తీశారు. అనంతరం ఉల్లి నాణ్యతను పరిశీలించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ పంటకాలం పూర్తయిన వాటినే కోత కోయాలని, పరిమితి చెందని వాటిని కోత చేయడం ద్వారా నష్టం వాటిల్లుతుందని రైతులకు సూచించారు. రైతులు తప్పనిసరిగా ఉల్లిని ఆరబెట్టి, గ్రేడింగ్ చేసి మార్కెట్ యార్డుకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, మార్కెట్ యార్డ్ ఆర్.జె.డి సి.రామాంజనేయులు, ఎమ్మిగనూరు తహశీల్దార్ శేషపాణి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేష్ నాయుడు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని రెండవ ప్రముఖ దేవాలయంగా అభివృద్ధి చెందిన శ్రీశైల శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి పాలకమండలి చైర్మన్ గా అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన పోతుగుంట రమేష్ నాయుడును ప్రభుత్వం నియమించింది.ప్రస్తుతం ఆయన బిజెపి నంద్యాల జిల్లా ఇన్చార్జిగా పనిచేస్తున్నారు.మొదటి నుంచి రమేష్ నాయుడు ఆర్ఎస్ఎస్ లో చురుకైన కార్యకర్త,ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగాల్లో వివిధ హోదాల్లో ఎనలేని సేవలందించారు.ఈ సందర్భంగా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.రమేష్ నాయుడు పర్యవేక్షణలో శ్రీశైల పుణ్య క్షేత్రం అభివృద్ధిలో ముందుకు సాగాలని ఎంపీ బైరెడ్డి శబరి ఆకాంక్షించారు.

# వైభవంగా ఎమ్మెల్యే కోట్ల జన్మదిన వేడుకలు

**డోన్, మేజర్‌న్యూస్:** డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ కేంద్రమంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యువనేత కోట్ల రాఘవేంద్రారెడ్డి కేక్‌కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, కోట్ల అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీశైలానికి భారీగా వరద..

**-7 గేట్లు ఎత్తివేత నీటి విడుదల**

**-ఇన్ ఫ్లో 2,30,328 క్యూసెక్కులు-అవుట్ ఫ్లో 2,60,528 క్యూసెక్కులు**

**శ్రీశైలం,మేజర్ న్యూస్:**

కృష్ణానది పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం డ్యామ్కు భారీగా వరద కొనసాగుతోంది. దీంతో ఉదయం నుంచి నాలుగు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న అధికారులు సాయంత్రం మరో మూడు గేట్లను ఎత్తి 7 గేట్ల ద్వారా నాగార్జున సాగర్కు 1,94,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జూరాల,సుంకేసుల,హంద్రీ ప్రాజెక్టుల ద్వారా శ్రీశైలానికి 2,30,328 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.రాత్రి 9 గంటల సమయానికి డ్యామ్ నీటిమట్టం 884.40 అడుగులు నీటి నిల్వ సామర్థ్యం 212.4385 టీఎంసీలుగా నమోదైంది.కాగాకుడి,ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రాల్లో బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు 32.463 మిలియన్ యూనిట్ల విద్యుత్ను ఉత్పత్తి చేశారు. ఇందుకోసం జలాశయం నుంచి 70,269 క్యూసెక్కుల నీటిని వినియోగించారు.అలాగే పోతిరెడ్డిపాడుకు 8 వేల క్యూసెక్కులు,హెచ్ఎన్ఎస్ఎస్కు 2,826 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.నీటి ఆవిరి రూపంలో 154 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

# నంద్యాలలో భూ ప్రకంపన

- సొమ్ము ఒకరిది... సోకు మరొకరిది
- తెరపైకి రూ. 40 కోట్ల విలువై స్థల వారసులు
- అక్రమార్కులు మున్సిపాలిటికి రహదారికి దానం
- దర్జాగా రహదారి ... రహదారి స్వాధీనానికి వారసుల చర్యలు
- పోలీసు కేసు నమోదుతో బిగ్ టర్న్

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల జిల్లా కేంద్రం భూ ప్రకంపనకు వేదికైంది. సొమ్ము ఒకరిది సోకు మరొకరిదన్న చందంగా అక్రమార్కులు రూ. కోట్ల విలువైన స్థలాన్ని మున్సిపాలిటికి రహదారి రూపంలో దానం చేశారు. రూ. 40 కోట్ల విలువైన స్థల వారసులు తెర పైకి రావడంతో భూ ఆక్రమణల అంశం వెలుగు చూసింది. మున్సిపాలిటి దర్జాగా ఏర్పాటు చేసుకున్న రహదారిని వారసులు స్వాధీనం వైపు చర్యలు చేపట్టారు. గత ఏడాది నమోదైన ఒక పోలీసు కేసు భూ మాయజాలంలో బిగ్ టర్న్ తీసుకుంది. పోలీసు కేసులో నిందితుడు ఇచ్చిన సమాచారంతో రూ. కోట్ల విలువైన స్థలంలో ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూస్తున్నాయి. స్థల వారసులు వెల్లడిస్తున్న అంశాలు నంద్యాల జిల్లా కేంద్రంలో భూ ఆక్రమణల వ్యవహారంలో సూత్రదారులు పాత్రదారులు ఒక్కొక్కరుగా వెలుగులోకి వస్తున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో రూ. కోట్ల విలువైన ఎకరా పొలంపై అప్పటి అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నేత ఒకరు తెర వెనుక ఆక్రమణ బాగోతాన్ని సినీ ఫక్కీలో కథాంశాన్ని రూపొందించారు. అప్పటి అధికార పార్టీ ముఖ్య నేతలతోపాటు నంద్యాల మున్సిపాలిటిలో అప్పటి అధికారులు క థా దర్శకుడికి కర్త, కర్మ, క్రియగా నిలిచారు. నంద్యాల జిల్లాగా మారిన తర్వాత భూముల కు రెక్కలు వచ్చాయి. నాలుగేళ్ళ క్రితం వరకు చిన్న తరహా అడవిని తలపించిన రూ. కోట్ల విలువైన పొలాన్ని తిలా పాపం తలాపిడికెడు పంచుకున్నారు. ఆ స్థల వారసులు స్థలాన్ని తమ స్వాధీనంలోకి తీసుకొనేందుకు ఉపక్రమించడంతో నంద్యాల జిల్లా కేంద్రంలో భూ ఆక్రమణ మాయ ప్రపంచంలో ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది.

నంద్యాల జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక నంద్యాల మూలసాగరం సర్వే నెంబర్ 428లో గాజుల మాలన్‌బీ బ్యాంక్ వేలంలో 1938వ సంవత్సరంలో డాక్యూమెంట్ నెంబర్ 157తో అప్పటి నంద్యాల అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ ఎం. ప్రసాద్ ద్వారా సర్వే నెంబర్ 428-4లో 0.82 సెంట్లు, 428-5లో 0.75, 428-6లో 0.79 సెంట్లు మొత్తంగా 2.36 ఎకరాలను కొనుగోలు చేశారు. ఆమె అందులో 428-4లో 16 సెంట్లను మినహాయించుకొని మిగిలిన 2.20 ఎకరాలను బొరుగుల ఖాదర్ మొద్దీన్, గాజుల కాసీమ్ సాహెబ్‌లకు సర్వే నెంబర్ 428-4లో 0.66, 428-5లో 0.75, 428-6లో 0.79 సెంట్ల భూమిని వెరసి 2.20 ఎకరాలను 1940వ సంవత్సరం డాక్యూమెంట్ 2968లో విక్రయించారు. బొరుగుల ఖాదర్ మొద్దీన్, గాజుల కాసీమ్ సాహెబ్‌లు 2.20 ఎకరాల్లో 0.20 సెంట్లను డాక్యూమెంట్ నెంబర్ 549-1948తో బొగ్గరపు గురవయ్య కుమారుడు బొగ్గరపు వెంకట గురవయ్యకు సర్వే నెంబర్ 428-4బిగా విక్రయించారు. గాజుల మాలన్ బీ తన వద్ద ఉన్న సర్వే నెంబర్ 428-4లోని 0.16 సెంట్లను డాక్యూమెంట్ నెంబర్ 4085-1942తో బొగ్గరపు వెంకట గురవయ్యకు విక్రయించారు. బొగ్గరపు వెంకట గురవయ్య సర్వే నెంబర్ 428-4బిలో 0.20 సెంట్లు, 428-4ఎ 0.16 సెంట్లను డాక్యూమెంట్ నెంబర్ 549-1949తో, అలాగే బొరుగుల ఖాదర్ మొద్దీన్ నుంచి సర్వే నెంబర్ 428-4బిలో 0.46, 428-5లో 0.54 సెంట్లు కలపి ఎకరాను డాక్యూమెంట్ నెంబర్ 3235-1964తో కె. దూపన్న కొనుగోలు చేశారు. కె. దూపన్న తాను కొనుగోలు చేసిన 1.34 ఎకరాలను డాక్యూమెంట్ నెంబర్ 5913-1966లో మద్దెల కస్తూరిబాయికి అమ్మారు. ఆమె భర్త మద్దెల వీర వెంకట సత్యనారాయణ డాక్యూమెంట్ నెంబర్ 30-1973తో జిపిఏ పొందారు. ఆ తర్వాత 1982లో డాక్యూమెంట్ నెంబర్లు 1216 నుంచి భద్రిశెట్టి శివానంద ప్రసాద్, కరి సుధాకర బాబు, మాణిక్యాల చౌదరి వెంకమ్మ, జమునా బాయిలు 1.04 ఎకరాలను, అదే రోజు డాక్యూమెంట్ నెంబర్ 1217తో భద్రిశెట్టి శివానంద ప్రసాద్, కరి సుధాకర బాబు, మాణిక్యాల చౌదరి వెంకమ్మలు 0.30 సెంట్లను కొనుగోలు చేశారు. మాలన్ బీ నుంచి 2.20 ఎకరాలను కొనుగోలు చేసిన బొరుగుల ఖాదర్ మొద్దీన్, గాజుల కాసీమ్ సాహెబ్‌లో భాగస్తులైన ఖాదర్ మొద్దీన్ తనకు రాబడిన వాటాను మొత్తంగా విక్రయించారు. ఇక్కడి వరకు కథ బాగానే నడచింది. 1982లో గాజుల మాలన్ బీ మనుమడుగా అహమ్మద్ హుసేన్ నుంచి డాక్యూమెంట్ నెంబర్ 5464 నుంచి శివానంద ప్రసాద్, కరి సుధాకర బాబు భార్య చంద్ర, మాణిక్యాల చౌదరి వెంకమ్మలు సర్వే నెంబర్ 428-6లో 0.79 సెంట్లను అక్రమ కొనుగోలు చేశారు. ఇందులో సర్వే నెంబర్ 428లోని 428-4ఎ, 428-4బి, 428-5, 428-6ఎలో 0.42 సెంట్లను మున్సిపాలిటికి రహదారి రూపంలో దానం చేశారు. ఇందులో గాజుల కాసీమ్ సాహెబ్‌కు చెందిన 428-5లో 0.21 సెంట్లు, 428-6లో 0.79సెంట్లు అక్రమంగా కొనుగోలుతో కలపి ఎకరాను డాక్యూమెంట్ రూపంలో స్వాధీనంలోకి తీసుకున్నారు. మాలన్ బీ నుంచి 2.20 ఎకరాలను కొనుగోలు చేసిన వారిలో ఒకరైన గాజుల కాసీమ్ సాహెబ్ వారసులు ఎవరూ ఇప్పటి వరకు విక్రయించలేదు. ఇప్పుడు అతని వారసుల్లో ఒకరైన గాజుల మహబూబ్ బాష తమ పెద్దల ఆస్తిలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లను ఒక్కొక్కటిగా తెరపైకి తీసుకొని వస్తున్నారు. ఇందు కోసం ఆయన ఆస్తికి సంబంధించిన కీలక పత్రాలను తెర పైకి తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో జరిగిన భూ మాయ జాలం ప్రస్తుతం నంద్యాల జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. తమ పెద్దలకు చెందిన ఎకరా ఆస్తిని అక్రమంగా రిజిస్టర్ చేసిన అహమ్మద్ హుసేన్‌పై గాజుల మహబూబ్ బాష 2024వ సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో నంద్యాల పట్టణానికి చెందిన పలువురు ప్రముఖుల పేర్లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు కేసు విచారణను వేగవంతం చేశారు. 2007వ సంవత్సరంలో అప్పటి అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుడు ఇందులో ప్రధాన భూమిక పోషించారు. మొత్తం మీద నంద్యాల జిల్లా కేంద్రంలో అక్రమ భూ ఆక్రమణ ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.



మున్సిపాలిటికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన రహదారి





వివాదాస్పదమైన స్థలాలు ఇవే

సూర్య www.suryaa.com



# భూ సేకరణ పెండింగ్ అంశాలను వేగవంతంగా పరిష్కరించండి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లాలో వివిధ పరిశ్రమలు, విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో, ఆర్డీవోలు, సంబంధిత మండల తహశీల్దార్లు, తదితర అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, సామాజిక మౌళిక సదుపాయాల విస్తరణలో భూసేకరణ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో రైతులు, అసైన్డ్‌దారులతో సమన్వయం చేసుకుని నివేదికలు పంపాలని ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లాలో కుసుమ్ ప్రాజెక్టు కోసం మిడుతూరులో 162 ఎకరాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుల కోసం రుద్రవరం, చాగలమర్రి, ఆళ్ళగడ్డ ప్రాంతాల్లో కలిపి 315 ఎకరాలు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ కోసం డోన్, బేతంచెర్లలో 2,860 ఎకరాలు, ఎంఎస్ఎంఈ ప్రాజెక్ట్ కోసం సుగాలిమెట్టలో 49 ఎకరాలను కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పెట్టుబడులు, పరిశ్రమలు సజావుగా సాగేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను సూచించారు. పరిశ్రమలతో పాటు విద్యా, సంక్షేమ రంగాలు ముందుకు సాగాలంటే సమయపాలనతో సమన్వయంతో అధికారులు పనిచేయాలని ఆమె పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు విశ్వనాథ్, నరసింహులు, నాగజ్యోతి, సంబంధిత మండల తహశీల్దార్లు పాల్గొన్నారు.

# ప్రకృతి ప్రేమికులకు ఉచితంగా మొక్కలు పంపిణీ

**– నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్**

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** కర్నూలు నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో "స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా హరిత ఆంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ప్రతి ఇంటి మేడపై, అపార్టుమెంట్లు, బాల్కానీలలో మొక్కలు, పండ్ల చెట్లు, కూరగాయలు పెంచే వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక బహుమతులు అందచేయనున్నట్లు కమీషనర్ పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ వివరాలను సంబంధిత సచివాలయ పరిధిలోని శానిటేషన్ కార్యదర్శుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20న నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు 16శానిటేషన్ డివిజన్లలో 9రకాల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వివిధ సంస్థలు తమ పరిసరాలను హరిత ప్రాంగణాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

# కర్నూలు క్రీడాకారుడిని అభినందించిన శాప్ ఛైర్మెన్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ ః** ఈ నెల 4నుండి 8వ తేదీ వరకు బీహార్‌లో జరిగిన జాతీయ స్థాయి మోడ్రన్ పెంటాథాలాన్ పోటీలలో జిల్లాకు చెందిన క్రీడాకారుడు వెంకట భరత్ అండర్–21కేటగిరిలో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా విజయవాడ కేంద్రంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శాప్ ఛైర్మన్ రవీనాయుడు వెంకట భరత్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ క్రీడాకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేసిందన్నారు.


వెంకట భరత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

# నంద్యాల సబ్‌డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలు

**– ఏఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్**



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల సబ్ డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని ఏఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్ అన్నారు. ఏలాంటి ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు లేవని తెలిపారు. నేడు శుక్రవారం ఉదయం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి, యువజన విభాగాలతో ఛలో మెడికల్ కాలేజ్ పేరుతో ర్యాలీ నిర్వహించాలని చేపట్టాలని జిల్లా పోలీస్ వారికి ఎటువంటి పర్మిషన్ మంజూరు చేయలేదని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మొదటి, రెండవ సంవత్సరం పరీక్షలు ఉదయం 10 నుంచి 1 గంట వరకు జరుగుతాయని అన్నారు. ఈ పరీక్షలు ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతాయని అన్నారు. ఈ సందర్భంగా వైఎస్ ఆర్‌సీపీ నాయకులు మెడికల్ కాలేజీలో చేపట్టాలనుకున్న ఆందోళన కార్యక్రమంతో పరీక్షలకు అంతరాయం కలిగించే అవకాశం ఉందన్నారు. అలాగే విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల మెడికల్ కాలేజీ వద్ద ఎటువంటి అనుమతులు ఇవ్వబడవని అన్నారు. అలాగే పోలీస్ చట్టం సెక్షన్ 30 అమలులో ఉన్నందున గుంపులుగా ఉండటం, ర్యాలీలు, ప్రదర్శనలకు అనుమతులు లేవని అన్నారు. ఉల్లంఘించిన పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కర్ణాటక మద్యం స్వాధీనం



**మంత్రాలయం, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల మాధవరం చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకొంది. మాధవరం చెక్‌పోస్టు ఎక్సైజ్ సిఐ ప్రసాదరావు తెలిపిన వివరాలు ఆదోని టౌన్‌కు చెందిన సుబ్బమ్మ అక్రమంగా మద్యాన్ని కర్ణాటక బస్సులో తరలిస్తుండగా, ఎమ్మిగనూరు సిబ్బందితో తనిఖీ చేసి పట్టుకున్నారు. 96 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నిరుపేద విద్యార్థులను తీర్చిదిద్దిన మహోన్నత పంతులమ్మ ఇకలేరు..


మృతిచెందిన మాజీ ఉపాధ్యాయురాలు హైమావతి(80) (ఫైల్‌ఫోటో)

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణానికి చెందిన హైమావతి(80) వెల్దుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దశాబ్దాల క్రిందట ఎంతో మంది నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులను తీర్చిదిద్దిన మహోన్నత ఉపాధ్యాయురాలు గురువారం స్వర్గస్తులైయ్యారు. ఈమె వెల్దుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దశాబ్దాల క్రిందట వెల్దుర్తిలో అనేక సంవత్సరాలు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ నిరుపేద పేద విద్యార్థినీ, విద్యార్థులను ఎంతో కృషి చేసి వారికి అక్షరాభ్యాసం చేయించి వారు ఉన్నత చదువులు చదువుకునేలా ఎంతో ప్రోత్సహించిందన్నారు. కొన్ని వందల కుటుంబాలు ఆమె మృతికి కన్నీరు మున్నీరౌతున్నారంటే ఆమె తన ఉపాధ్యాయురాలి వృత్తిపట్ల ఎంత నిబద్దతతో వ్యవహరించిందో అర్థం చేసుకోవచ్చు. ఆమె దగ్గర చదువుకున్న ఆనాటి విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో గొప్ప స్థాయిలో ఉన్నారు. గ్రామ పెద్దలు, ఆమె శిష్యులు పార్థీవదేహాన్ని దర్శించి ఆమెకు ఘనంగా నివాళులు అర్పించారు.

# ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరిస్తాం..


ప్రభుత్వ భూములను సర్వే చేస్తున్న సర్వే అసిస్టెంట్ డైరెక్టర్

**హాలహర్వి,మేజర్ న్యూస్ :** జిల్లాలో ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరణ చేస్తామని జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ మణి కన్నన్ అన్నారు.గురువారం హాలహర్వి మండలంలో తహశీల్దార్ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో డివిజనల్ సర్వేయర్ భాస్కర్ తో కలిసి ప్రభుత్వ భూములను సర్వే చేశారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అన్నారు.మండలంలో ప్రభుత్వం గుర్తించిన భూములు, అటవీ, బంజరు,ఫోరం బోకు భూము లు చాలా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్లు భార్గవి, మహేంద్రలు పాల్గొన్నారు.

# విఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలిని ధర్నా


తహసీల్దార్ వినతిపత్రం ఇస్తున్న విఆర్‌ఏలు

**దొర్నిపాడు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘంఆదేశాల మేరకు దొర్నిపాడు మండలంలోని అన్ని గ్రామ రెవిన్యూ సహాయకులు గురువారం తహసీల్దార్ ఆఫీస్ వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వి ఆర్ ఏ లు చంటి. చెన్నయ్య లు మాట్లాడుతూ వి ఆర్ ఏ ల ప్రధాన సమ స్యలైన పే స్కెలు అమలు, నామినిలకు వి ఆర్ ఏ లు గా అవకాశం కల్పించాలని అర్హులకు ప్రమోషన్ మరియు కారుణ్య నియామకాలు వంటివి నేటికీ అమలు కానందువలన ధర్నాలు ఆందోళనలు చేపట్టాలని సంఘం నిర్ణయించడం వలన ఈ రోజు ధర్నా నిర్వహించడం జరిగింది అని వారు తెలిపారు అందులో భాగంగా 18,19తేదీలలో తహసీల్దార్ కార్యాలయా ల వద్ద ధర్నా అనంతరం తహసీల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం అలాగే 20,న ఆర్డీఓ కార్యా లయాల వద్ద ధర్నా అనంతరం ఆర్డీఓ కు వినతిపత్రం ఇవ్వడం అలాగే 22వ తేదీన జిల్లా కేంద్రాలలో కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అని కావున డివిజన్ లో అన్ని గ్రామాల వి ఆర్ ఏ పాల్గొని విజవంతం చేయాలనీ వారు తెలిపారు ఈ కార్యక్రమం లో చంటి, చెన్నయ్య అన్ని గ్రామాల గ్రామ రెవిన్యూ సహాయకులు పాల్గొన్నారు

# రైతులకు అందుబాటులో యూరియా బస్తాలు

**– యూరియా కొరకు స్లాట్ బుకింగ్ సిస్టమ్**


రైతులకు టోకెన్లు అందజేస్తున్న అధికారులు

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని 4 గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో యూరియా 95 టన్నులు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని బుక్కాపురం, తిమ్మాపురం, బొల్లవరం, తమ్మడపల్లి గ్రామాలలో కలిపి ఈ 95 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులకు పంపిణీకి సిద్ధం చేస్తున్నామని అన్నారు. రైతులు ఒక్కసారిగా మీదపడి గొడవలు జరగకుండా నూతనంగా స్లాట్ పద్దతిని తీసుకొని వచ్చామని అన్నారు. గ్రూపులుగా విభజన చేసి గంటకు 10 మంది లెక్క రైతులను విభజన చేసి టోకెన్ సిస్టమ్ ఇవ్వడం జరిగిందని అన్నారు. వారికి శుక్రవారం టోకెన్లు ఇచ్చిన టైమ్ ప్రకారం యూరియా అందించడం జరుగుతుందని అన్నారు.

# కోడుమూరు దస్తావేజులేఖరుల పెన్ డౌన్


సబ్ రిజిస్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దస్తావేజులేఖర్లు

**కోడుమూరు, మేజర్ న్యూస్ ః** ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2.0 విధానం వల్ల ఏర్పడుతున్న సమస్యలపై కోడుమూరుకి చెందిన దస్తావేజులేఖరులు, స్టాంప్ వెండర్లు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం దస్తావేజు లేఖర్లు సబ్ రిజిస్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్బంగా దస్తావేజులేఖరులు మాట్లాడుతూ ఓటీపీలు బహిర్గతం చేయడంపై ప్రజలు సంకోచం వ్యక్తం చేస్తుండడం, ఆటోమేషన్ సిస్టంలో డిపార్ట్‌మెంట్ల మధ్య సమన్వయ లోపం కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు పేర్కొన్నారు. పిడీఈ విధానానికి తాము వ్యతిరేకం కాదని, అయితే అందులోని లోపాలను ప్రభుత్వం సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా సెప్టెంబరు 19నుండి 20వరకు వరుసగా రెండురోజుల పాటు పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు రాజశేఖర్, నాగరాజు, నరసింహయ్య, వేణుగోపాల్, అఖిల్, శ్రీరాములు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ స్వీపర్కు విషపురుగు కాటు..

- విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డ సిబ్బంది
- ఏడాది క్రితం విద్యార్థినిని కరిచిన పాము
- గతంలో హాస్టల్‌లో 20 మంది విద్యార్థినీలను కరిచిన ఎలుకలు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు




**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండల పరిధిలోని మోడల్స్కూల్లో స్వీపర్ గా పనిచేస్తున్న క్రిష్ణవేణమ్మకు బుధవారం ఉదయం గుర్తు తెలియని విషపురుగు ఫిజిక్స్ ల్యాబ్ను శుభ్రం చేస్తుండగా కాలుకు కాటు వేసింది. అయితే పాఠశాల సిబ్బంది ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్త పడింది. దీంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం మేరకు క్రిష్ణవేణమ్మ బుధవారం ఉదయం పాఠశాలలోని గదులను శుభ్రం చేసే కార్యక్రమంలో బాగంగా ఫిజిక్స్ ల్యాబ్ కు వెళ్లి శుభ్రం చేస్తుండగా గుర్తు తెలియని విషపురుగు కాటు వేసింది. కాలికి రెండు కాట్లు కూడా ఉన్నాయి. విషయం తెలుసుకున్న సిబ్బంది గోనెగండ్లకు చెందిన పాములు పట్టే వ్యక్తి ని పిలిపించి రూములో వెదకగా అక్కడ పాము తిరుగ తున్నట్లు గుర్తించారు. అలాగే గోడలకు రంధ్రాలు ఉండటంతో పాము చిక్కలేదు. అయితే అక్కడ తేళ్లు ఉన్నాయి. వాటిని చంపివేశారు. క్రిష్ణవేణమ్మను స్థానికంగా నాటువైద్యం చేయించి అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య చికిత్స లు చేయించారు. ఏలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారని తెలిసింది. అయితే తరగతి గదిలోనే పాము కరిచింది. అలాగే గతంలో అదే పాఠశాలలోని జాలికల నిరకం కారణంగా గత ఏడాది ఇదే పాఠశాలలో ఇంటర్మీడియట్ హాస్టల్లో ఉన్న 20 మంది విద్యారినెకు ఎలుకలు కరిచిన సంఘటన జరిగింది. జరిగిన సంఘటనలను చూసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

**డీఈవో దృష్టికి తీసుకువెళతా**
**రామాంజినేయులు, ఏఈవో గోనెగండ్ల :**
బుధవారం జరిగిన సంఘటన ను పాఠశాల సిబ్బంది మా దృష్టికి తీసుకురాలేదు, కొంతమంది సిబ్బంది ద్వార గురువారం సాయంత్రం విషయం తెలుసుకున్నారు. పాఠశాల సిబ్బంది తో విచారణ జరపగా విషపురుగు కాటు వేసింది వాస్తవం అయితే స్వీపర్ క్రిష్ణవేణమ్మ ఆరోగ్యంగా ఉంది. గతంలో కూడా విద్యార్థికి పాముకాటు వేసింది విద్యార్థిలను ఎలుకలు కరవడం జరిగింది. బుధవారం జరిగిన విషయంను డీఈవో దృష్టికి తీసుకు వెలుతు న్నట్లు ఎంఈవో రామాంజినేయులు తెలిపారు.

**పలుమార్లు సమస్యను ప్రిన్సిపల్ దృష్టికి తీసుకువెళ్లిన స్పందించలేదు.. గోష్, మోడల్ స్కూల్ విద్యాకమిటీ ఛైర్మెన్ :**
పాఠశాల చుట్టు ముళ్ల పొదలు నిండిపోయాయి. దీంతో పాఠశాలచుట్లు విషసరుగులు, పాములు, తేళ్ళు తిరుగుతున్నాయి. గతంతో విద్యార్థికి పాము కాటు వేసింది అప్పటి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపల్ ను కోరినప్పటికి మేము చెప్పిన మాటలు పట్టుచుకోలేదు. విద్యార్థులత ల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం జరిగిన సంపు దాచడం దారుణం స్వీపర్ ప్రాణానికి ఏమైన జరిగి ఉంటే దానికి అచ్యులు ఎవరు అని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గౌస్ ప్రశ్నించారు జరిగిన సంఘటనలను అన్నింటిన కలెక్టర్ దృష్టికి తీసుకువెళతావన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా జన్మదిన వేడుకలు



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైసీపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ దాల్‌మిల్ అమీర్‌బాష ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి స్వగృహం వద్ద దాల్‌మిల్ అమీర్‌బాష ఆధ్వర్యంలో నాయకులు, కౌన్సిలర్లు, అభిమానులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే పట్టణ శివారుల్లోని ఎస్ఆర్బీసీ కాలనీలోని పరివర్తన లైఫ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి చిన్నారులకు నూతన వస్త్రాలు అందించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. విజయ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణమోహన్, వైసీపీ నాయకులు పిల్లి కిరణ్‌కుమార్, లక్ష్మినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖ ర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లిపంటకు ఏడాదంతా రూ.1200లు మద్ధత్తు ధర



**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** ఉల్లి పంటకు ఏడాది పొడవునా రూ.1200లు మద్దతు ధర ఉంటుందని కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ తెలిపారు. కోడుమూరు మండలంలోని వర్కూరు గ్రామంలో తహశీల్దార్ నాగరాజుతో కలిసి గురువారం ఉల్లి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉల్లి పంటను సాగు చేసిన రైతులు పంటకాలం పూర్తికాక ముందే పంటను తొలగిస్తే అవుటం తగ్గి మద్దతు ధర లభించదన్నారు. ఉల్లిని బాగా గ్రేడింగ్ చేసి ఎండబెట్టిన ఉల్లిని మార్కెట్‌కు తీసుకుపోవాలన్నారు. రైతులు తాము వేసిన పంటలను ఈక్రాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఆర్డీఓ వెంట విఆర్ఓ పరమేష్, సర్వేయర్లు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## కట్టని మెడికల్ కాలేజీపై వైసీపీ తప్పుడు ప్రచారం

- ఆదోనిలో కాలేజీ నిర్మాణం కనీసం 20శాతం కూడా పూర్తి కాలేదు
- కూటమి నేతలు భూపాల్ చౌదరి, మల్లప్ప, విట్టా రమేష్ విసుర్లు
- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీని 2028కల్లా పూర్తిచేస్తామని వెల్లడి
- పేదలందరికీ ఉచితంగా వైద్యసేవలు అందుతాయని ఆదోని ప్రజలకు భరోసా
- అసంపూర్తిగా ఉన్న కాలేజీ నిర్మాణాలను పరిశీలించిన కూటమి బృందం



70శాతం పూర్తయ్యిందా? అంటూ మెయిన్ హాస్పిటల్ నిర్మాణాన్ని చూపుతున్న దృశ్యం

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** 'ఆదోనిలో పూర్తిగా ఒక్క బిల్డింగ్ కూడా కట్టని మెడికల్ కాలేజీపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తోంది' అని కూటమి నాయకులు కర్నూలు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, జనసేన పార్టీ ఇంచార్జ మల్లప్ప, బీజేపీ నాయకులు విట్టా రమేష్ లు మండిపడ్డారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలన్న ఉద్దేశంతో కూటమి నేతలు గురువారం ఆదోని మెడికల్ కాలేజీలో ఇప్పటివరకు జరిగిన నిర్మాణ పనుల తీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఒక బిల్డింగు కూడా సరిగా కట్టలేని వైసీపీవాళ్లు నిస్సిగ్గుగా వారి అసమర్థతను బయట పెట్టుకుంటున్నారని ఎద్దేవ చేశారు. ఈ మెడికల్ కాలేజీలోని 24 గంటలు పాటు వైద్యం అందించే ప్రధానమైన బిల్డింగ్ నిర్మాణం పునాదిలోనే నీట మునగడం శోచనీయమన్నారు. ప్రధానమైన ఆసుపత్రి భవనం, ఓపి వార్డు, ఎమర్జెన్సీ వార్డు, గర్ల్స్ హాస్టల్, ఐపీడీ, ఓపీడీ వంటి నిర్మాణ పనులు కనీసం 15శాతం కూడా పూర్తి కాలేదని ఆక్షేపించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో ఆదోని మెడికల్ కాలేజీ నిర్వహణపై వైసీపీ నాయకులు చేస్తున్నవన్నీ అసత్యపు ఆరోపణలనే అని కొట్టి పారేశారు. మెడికల్ కాలేజీలో నీట్ ద్వారా సెలెక్ట్ అయిన ప్రతి విద్యార్థికి మెడికల్ సీటు కు ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. పీపీపీ విధానంతోనే ఈ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయి నాణ్యమైన వైద్యం అందుతుందని తెలిపారు. అనంతరం రాష్ట్రంలో మెడికల్ కాలేజీల వివరాలను భూపాల్ చౌదరి వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలకు సంబంధించిన అంచనా వ్యయం మొత్తం రూ. 8,480 కోట్లు అయితే.. అందులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 975కోట్ల నిధులతో కలిపి మొత్తం రూ. 1450 కోట్లు మాత్రమే నాటి వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేసిందని విమర్శించారు. అంతేకాకుండా మెడికల్ కాలేజీల పేరు చెప్పి రూ. 4948 కోట్లు అప్పు తెచ్చినా కూడా పూర్తిస్థాయిలో మెడికల్ కాలేజీలను నిర్మిం చకపోగా, కాంట్రాక్టర్లకు మరో రూ. 674కోట్లు బకాయిలు పెట్టి వెళ్లారని ఆరోపించారు. ఆదోనిలో రూ. 357.74 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించాలనుకున్న ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణ పనులకు వైసీపీ ప్రభుత్వం రెండేళ్ళలో ఖర్చు పెట్టింది కేవలం రూ.81 కోట్లు మాత్రమేనని వివరించారు. అరకొరగా ఒకటి రెండు బిల్డింగులు మినహా.. ఏ ఒక్క నిర్మాణం కూడా కనీసం 15 - 20శాతం కూడా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడేమో ఆదోని వైసీపీ నాయకులు కాలేజీని 70 - 80శాతం తామే పూర్తి చేశామంటూ గగ్గోలు పెట్టడం ఎంతో హాస్యాస్పదంగా ఉందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 23. 83కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే పార్ధసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, మల్లప్పలు కలిసికట్టుగా చిత్తశుద్ధితో పనిచేసి 2028కల్లా మెడికల్ కాలేజీని పూర్తి చేస్తామని చెప్పారు. అయితే మెడికల్ కాలేజీని పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించడం కన్నా, ఆయా రంగాల్లో నిపుణులైన ప్రైవేటు వ్యక్తుల భాగస్వా మ్యంతో నిర్వహిస్తేనే ఆదోని ప్రాంత ప్రజలకు మెరుగైన ప్రమాణా లతో వైద్య సేవలు అందుతాయని భూపాల్ చౌదరి స్పష్టం చేశారు. యువనేత మారుతి నాయుడు, కునిగిరి నీలకంఠ, రామస్వామి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప, వెంకటేష్ చౌదరి, వీరేష్, లక్ష్మీనా రాయణ, నాగరాజుగౌడ్ కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖపై ప్రజల్లో సంతృప్త స్థాయిని పెంచండి


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారి

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** విద్యుత్ శాఖపై ప్రజల్లో సంతృప్త స్థాయిని పెంచాలని ఏపిఎస్‌పి డిసిఎల్ సిఎండి కె సంతోష్ రావు, డైరెక్టర్ టెక్నికల్ ఏపిఎస్‌పి డిసిఎల్ కె గురువయ్యలు అన్నారు. గురువారం నగర శివారులోని ఓ ప్రైవేటు కళాశాలలో విద్యుత్ శాఖ ఉద్యోగులకు కర్నూలు సర్కిల్ ఎస్ఈ ఉమాపతి ఆద్వర్యంలో ప్రభుత్వం ప్రతి నెల చేపడుతున్న విద్యుత్ శాఖపై సానుకూల ప్రజాభిప్రాయం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా అంతరాయం లేని విద్యుత్ సరఫరా అవుతుందా..సరైన ఓల్టేజ్‌తో విద్యుత్ అందుతుందా..విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉన్నారా..ఈ విషయాలపై సర్వే చేపడుతున్నామన్నారు. వీటికోసం మేనేజ్‌మెంట్ అన్ని విదాల చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యుత్ శాఖలో ప్రతిఒక్కరు అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందన్నారు. లైనెమెన్ ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు నిరంతరమైన విద్యుత్ పంపిణీ చేయాలఎని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వ్యాధులు రాకుండా ఉండాలంటే జీవనశైలిని మార్చుకోవాలి



**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కొన్ని రకాల వ్యాధులు రాకుండా ఉండాలంటే జీవనశైలిని మార్చుకోక తప్పవని అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డా. మహేశ్వర ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని పర్ల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని డా. మహేశ్వర ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీదేవి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, పర్యవేక్షకులు ధర్మ శేఖర్, సామాజిక ఆరోగ్య అధికారి అరుణజ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు రజని, సునీత, ఆశా కార్యకర్తలు, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

# మా పొలాన్ని మాకిప్పించండి సారూ.. అంటూ మహిళ రైతులు

- పొలాన్ని ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్న రంగనాయకులు పై పోలీసులకు ఫిర్యాదు
- ఆకుల సలాంపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు


పాత్రికేయులతో మాట్లాడుతున్న మహిళ రైతులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆక్రమణకు గురైన మా పొలాన్ని మాకిప్పించి న్యాయం చేయాలంటూ కరివేన గ్రామానికి చెందిన మహిళ రైతులు బర్నాల కృష్ణమ్మ, గీతమ్మలు అధికారులను కోరుతున్నారు. మండలంలోని కరివేన గ్రామానికి చెందిన మురళీ కృష్ణశర్మ, చక్రవర్తులకున్న అగ్రహర భూమి సర్వేనంబర్ 226-2లో 93 సెంట్ల భూమి తాము కొనులు చేయడం జరిగిందని మహిళ రైతులు చెబుతున్నారు. అయితే రంగనాయకులు అనే వ్యక్తి 93 సెంట్ల చుట్ట వేసిన పోల్స్‌ను తొలగించి ఇదింతా నా పొలమే అంటూ కంచెవేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమని మహిళ రైతులు ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యం చేస్తున్నట్లు మహిళ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా పొలాన్ని ఆక్రమించిన రంగనాయకులపై చర్యలు తీసుకోని మాకు న్యాయం చేయాలంటూ మహిళ రైతులు కోరుతున్నారు. ఈ మేరకు పోలీసు స్టేషన్‌లో రంగనాయకులపై ఫిరాయదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉంటే మా పొలం వివా దంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆకుల సలాం కు ప్రమేయం ఉందంటూ రంగనాయకులు అనే వ్యక్తి ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. భూమి వివాదంలో ఆకుల సలాంకు ఎటువంటి సంబంధం లేదని తెలియజేశారు. ఆక్రమణకు గురైన మా స్థలాన్ని మాకిప్పించాలని మహిళ రైతులు కోరుతున్నారు.

# మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** సర్దార్ భగత్‌సింగ్ 118వ జయంతి సందర్బంగా ఈ నెల 27వ తేదీన ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆద్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిసున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈ శ్రీరాములు, కె శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం ఏఐవైఎఫ్ నగర ముఖ్య నాయకుల సమావేశం నగర అధ్యక్షులు బి నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28న భగత్‌సింగ్ జయంతి సందర్బంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు, భగత్‌సింగ్ ఫాలోవర్స్ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బీసన్న, కృష్ణ, చంటి, అఖిల్, సూర్య మధు, శివ, రసూల్, మధు, చిన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షం.. పొంగిన వాగులు



**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్ల మండలంలో గురువారం ఉదయం నుంచి భారీ వర్షం కురవడంతో మండలంలోని పలు వంకలు, వాగులు పొంగిపొర్లి ప్రవహించాయి. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని కంపమల్ల గ్రామం సమీపంలోని బుచ్చమ్మ వాగు ఉదృతంగా ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. కంపమల్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో వర్షపు నీరు నిలిచి ఇళ్లల్లోకి నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు పంట పొలాలలో వర్షపు నీరు నిలిచి తీవ్ర నష్టం వాటిల్లింది. అకాల వర్షంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

# మొక్కజొన్న రైతాంగాన్ని ఆదుకోవాలి

- లారీ అసోసియేషన్‌కు రైతులు డబ్బు ఎందుకు కట్టాలి
- రాష్ట్ర వైసీపీ కార్యదర్శి, ఆళ్లగడ్డ నియోజకవర్గ వైసీపీ నాయకులు భూమా కిషోర్ రెడ్డి




**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్:** నియోజకవర్గంలోని మొక్కజొన్న రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర వైసీపీ కార్యదర్శి, ఆళ్లగడ్డ నియోజకవర్గ వైసీపీ నాయకులు భూమా కిషోర్ రెడ్డి ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 15 రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మొక్కజొన్న చేతికచ్చే సమయానికి వర్షం పడడంతో పంటకు తెగులు రావడం జరిగిందన్నారు. కోత కోసిన పంటను రోడ్లమీద ఆరపోసుకున్న వారి పరిస్థితి వర్షం రాకతో ధైన్యంగా మారిందన్నారు. ప్రభుత్వం బాధ్యత తీసుకొని రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో ఉల్లిగడ్డ, టమోటా రైతుల పరిస్థితి దయనీయంగా ఉన్నట్లే మొక్కజొన్న రైతుల పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయన్నారు. నంద్యాల జిల్లాలో 1,55,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని అలాగే ఆళ్లగడ్డ మండలంలో 1500 ఎకరాలు మొక్కజొన్నను రైతులు సాగు చేయడం జరిగిందన్నారు. మా ఎమ్మెల్యే పట్టించుకున్న పట్టించుకోకపోయినా జిల్లా టిడిపి యంత్రాంగమైన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మొక్క జొన్న రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు పట్టణంలో ఏర్పాటు చేసిన లారీ అసోసియేషన్ తో మరో సమస్య ఎదురైందన్నారు. చెన్నై నుంచి వచ్చిన లారీలలో ఎగుమతి చేస్తే రైతులతో క్వింటాకు ఇంత అని వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. లారీ అసోసియేషన్కు రైతులు ఎందుకు డబ్బు కట్టాలని ఆయన ప్రశ్నించారు. ఇండియాలో ఎక్కడైనా తమ పంటను అమ్ముకునే హక్కు రైతులకు ఉందన్నారు. తాము చెప్పిన లారీల లోనే పంపించుకోవాలన్న నిర్ణయం సరికాదన్నారు. ఇసుక , కోళ్లు అన్ని వ్యాపారాలు అయ్యాయని రైతులు నష్టపోయే చర్యలు చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి అయినా తీసుకెళ్తామన్నారు. ఎవరి ప్రోద్బలంతో లారీ అసోసియేషన్ లో ఇలాంటివి జరుగుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కొత్త దందాలు ఆపాలని రైతులకు , వ్యాపారస్తులకు నష్టం చేసే చర్యలను ప్రోత్సహించవద్దని భూమా కిషోర్రెడ్డి అన్నారు. లారీ అసోసియేషన్ నష్టపోవాలని తాము కోరుకోవడం లేదని అందరికీ న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన కోరారు.

# శ్రీశైల మల్లన్న హుండీ ఆదాయం రూ.3.46 కోట్లు



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల ఉభయ దేవాలయాల హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు.భక్తులు గత 29 రోజులలో సమర్పించిన కానుకల్లో రూ. 3,46,96,431 నగదు రాబడి తోపాటు 131 గ్రాముల 300 మిల్లీగ్రాముల బంగారం,5 కేజీల 50 గ్రాముల వెండి ఆదాయంగా చేకూరుంది. అదేవిధంగా యుఎస్ఏ డాలర్లు 2321,మలేషియా రింగిట్స్ 57,కెనెడా డాలర్లు 20,కత్తార్ రియాల్స్ 567,యుఏఈ దిర్హామ్స్ 845,ఆస్ట్రేలియా డాలర్లు 15,ఈరోస్ 30,యు.కె.పౌండ్స్ 165,జాంబియా క్వాచాలు 100,కాంగో ఫ్రాంకులు 2000,నేపాల్ రూపాయలు 90,శ్రీలంక రూపాయలు 20 మొదలైన విదేశీ కరెన్సీ కూడా హుండీల లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమములో దేవస్థానం డిప్యూటీ ఈవో రమణమ్మ, అధికారులు,సిబ్బంది,శివ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# సంయుక్తంగా అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించాలి

**– కమీషనర్ పి విశ్వనాథ్**



**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** నగరంలో అనధికార లేఔట్లను ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా ప్రజలు క్రమబద్ధీకరించుకునేలా పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బంది అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పట్టణ విభాగ అధికారులు, ప్లానింగ్, అమినిటీస్, వెల్ఫేర్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగరంలో 150కిపైగా అనధికార లేఔట్లు ఉన్నాయని వాటన్నింటినీ సంబంధిత ప్రజలు క్రమబద్ధీకరించుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా ప్లానింగ్, అమినిటీస్, వెల్ఫేర్ కార్యదర్శులు సంయుక్త బృందంగా ఏర్పడి ఆయా సచివాలయ పరిధిలోఅనధికార లేఔట్లు, నిర్మాణాలను త్వరితగతిన గుర్తించాలని ఆదేశించారు. అనంతరం ప్లానింగ్ కార్యదర్శులు సేకరించిన కచ్చితమైన వివరాలపై సంతకం చేసి అందించాలన్నారు. అక్రమ నిర్మాణదారులకు తుది నోటీసులు జారీచేయాలని, ఎల్ఆర్ఎస్ పథకంలో నమోదు చేసుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవడంలో ఉపేక్షించొద్దని హెచ్చరించారు. ఎల్ఆర్ఎస్ పథకానికి ఇప్పటివరకు 843దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా అక్రమ నిర్మాణాలు క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమీషనర్ సతీష్ కుమార్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిసిపి వెంకట రమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష తదితరులు పాల్గొన్నారు.

# రిడ్జ్ పాఠశాలలో ఘనంగా దసరా ఉత్సవం



**కర్నూలు స్పోర్ట్స్, మేజం న్యూస్ :** లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాలలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని దసరా ఉత్సవం-2025ను ఘనంగా నిర్వహించారు. పాఠశాలను రంగురంగుల పూలతో అలంకరించి విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. పాఠశాల సిఈఓ గోపినాథ్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పండుగలు మనకు సాంప్రదాయాలను గుర్తు చేస్తాయని, దసరా ఉత్సవం మనలోని చెడు అలవాట్లను తొలగించి, సత్ప్రవర్తనకు మార్గం చూపుతుందన్నారు. విద్యార్థులు పాటలు, నృత్యాలు, రూపకాలు ప్రదర్శించి ఉత్సవం ప్రత్యేకతను ప్రతిభింబించారు. చిన్నారులు దుర్గామాత స్తోత్రాలు ఆలపించి అందరి ప్రశంసలు పొందారు. బొమ్మల కొలువు అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో కో సిఈఓ సౌమ్య గోపినాథ్, డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్ కమల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఓ కళాశాల విద్యార్థిని కిడ్నాప్

- కళాశాల నుండి ఇంటికి వెళ్తుండగా ఘటన
- గుర్తు తెలియని వ్యక్తులు కారులోకి లక్కోని వెళ్లినట్లు సమాచారం

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన చాగలమర్రిలోని ఓ కళాశాలకు చెందిన విద్యార్థిని షాజిదా గురువారం కిడ్నాప్ గురైంది. వివిరాల్లోకి వెళితే వైఎస్సార్ జిల్లా, దువ్వూరు మండలం, కానగూడురు గ్రామానికి చెందిన మంత్రాల గౌస్, మస్తాని దంపతుల కుమార్తె సాజిదా చాగలమర్రిలోని ఓ కళాశాలలో 3వ సంవత్సరం బిఎస్సి విద్యనభ్యసిస్తుంది. ప్రతి రోజులాగే విద్యార్థిని షాజిదా తోటి విద్యార్థులతో కలిసి కళాశాలకు వచ్చింది. ఉదయం 11.30 ల సమయంలో నాకు అనారోగ్యంగా ఉంది ఇంటి కెళ్తానని ప్రిన్సిపల్ ను విద్యార్థిని షాజిదా అనుమతి కోరింది. దీంతో ప్రిన్సిపల్ ఆమె తండ్రికి ఫోన్లో మాట్లాడగా అనుమతి ఇవ్వాల్సిందిగా తండ్రి గౌస్ చెప్పడంతో ఆమేకు ఇంటికి వెళ్ళటానికి అనుమతించారు. అయితే ఆమే 12.00 గంటల సమయం తరువాత ఇంటికి వెళ్ళటానికి కళాశాల నుండి బయటికి రాగ అక్కడే కాపు కసిన గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు విద్యార్థిని షాజిదాను బలవంతంగా కారులోకి లక్కోని కిడ్నాప్ కి పాల్పడినారు. మధ్యాహ్నం 2.00 గంటలతరువాత తన తండ్రి గౌస్కు షాజిదా ఫోన్ చేసి కళాశాల బయటికి వచ్చిన తరువాత ఇద్దరు గుర్తు తెలియన వ్యక్తులు నన్ను కిడ్నాప్ చేసి కారులో ఎక్కడెక్కడో తిప్పుతున్నారని, నేను ఎక్కడ ఉన్నానో నాకు తెలియడం లేదని చేప్పిందని, తరువాత ఫోన్ స్వీచ్ ఆఫ్ అయ్యిందని తండ్రి గౌస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎస్ఐ సురేష్ అప్రమత్తమై అప్పటికే సిబ్బందితో గాలింపు చేపట్టి, సమాచారాన్ని వెంటనే ఆళ్ళగడ్డ రూరల్ సిఐ మురళిధర్రెడ్డికి అందించటంతో ఆయన హుటాహుటిన చాగలమర్రిలోని ఆ కళాశాలలో చేరుకోని ప్రిన్సిపల్ సంఘటనా వివరాలను తెలుసుకోని, సిసి ఫుటేజిని పరిశీలించారు. అనంతరం విద్యార్థిని షాజిదా చివరి ఫోన్ కాల్ లోకేషన్తో పోలీసు సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు.

# జగన్ చెప్పిన మెడికల్ కాలేజ్ ఆహా ఓహో.. ఇదిగో!

◆ ఆదోని మెడికల్ కాలేజ్ 70 శాతం పూర్తయ్యిందా? జగన్ అంటూ సెటైరికల్ స్లోగన్స్

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** వైయస్ జగన్మోహన్ రెడ్డి చెప్పిన ఆహా! ఓహో!మెడికల్ కాలేజ్ ఇదే' అంటూ కూటమి నేతలు భూపాల్ చౌదరి,మల్లప్ప, విట్టా రమేష్, మారుతినాయుడులు సెటైరికల్ స్లోగన్స్ఇచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైసీపీ పార్టీ చేస్తున్న నిరసనలను తిప్పికొడుతూ గురువారం ఆదోని మెడికల్ కాలేజీ వద్దకు కూటమి నాయకులు భారీగా చేరుకున్నారు. కాలేజీ వద్ద ఇప్పటివరకు జరిగిన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వైసీపీ హయాంలో అసంపూర్ణంగా నిర్మించిన మెడికల్ కాలేజీకి సంబంధించిన నిర్మాణాలను ఈ సందర్భంగా మీడియాకు చూపించారు.నీటిలో మునిగి ( బేస్ లెవల్ నిర్మాణంలో ఆగిపోయిన ప్రధానమైన ఆసుపత్రి భవనం) ఉన్న మోకాళ్ళలోతున నీటిలోకి దిగి.. మాజీ సీఎం జగన్ అదేవిధంగా ఆదోని వైసీపీ నాయకులు చెబుతున్న 70శాతం పూర్తయిన మెడికల్ కాలేజీ ఇదేనంటూ ఆహా ఓహో.. ఇటుచూడు జగన్ అంటూ పెద్ద పెట్టున సెటైరికల్ నినాదాలు చేశారు. ఇక్కడ కనీసం 20శాతం పనులు కూడా పూర్తికాని


బేస్ లెవెల్ నిర్మాణంలో ఆగిపోయిన మెయిన్ హాస్పిటల్ ను చూపుతున్న కూటమి నేతలు

మెడికల్ కాలేజీను చూపిస్తూ విద్యార్థులను రెచ్చ కొట్టడమే కాకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ పార్టీ చేస్తున్న ఫేక్ ప్రచారాలను ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దని ఈ సందర్భంగా కూటమి నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కర్నూలు మెడికల్ కాలేజీ మాదిరిగానే పీపీపీ విధానంలో అన్ని వైద్య వసతులతో ఆదోని మెడికల్ కాలేజీని నిర్మించి పేదలందరికీ ఉచిత వైద్య సేవలను అందిస్తామని స్పష్టం చేశారు.

# పౌష్టికాహారంతో ఆరోగ్యం



**దొర్నిపాడు మేజర్ న్యూస్ :** గర్భిణీలు,కిషోరబాలికలు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యాంగా ఉంటారని ఆర్ బి ఎస్ కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్ అన్నారు గురువారం మండల కేంద్రమైన దొర్నిపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నందు వైద్యాధికారులు డాక్టర్ వెంకటశివ, డాక్టర్ మహమ్మద్ రూహుల్ళాఖాన్ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళా శక్తివంతమైన కుటుంబం )అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది 15రోజులపాటు వివిధమైన కార్యక్రమాల నిర్వహణకు వైద్యాఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 104,ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి, ఆర్‌బిఎస్ కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతారావు నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక కారణాల వలన హాస్పిటల్ కు వెళ్లలేని స్థితిలో ఉండే వారికీ అండగా నిలిచి వారికీ వైద్యసాయం అందించడమే ఈ అభియాన్ ముఖ్య ఉద్దేశమని వారు అన్నారు కార్యక్రమం లో మహిళలుగర్భవతులు కిషోరబాలికలకు స్క్రినింగ్, రక్తపోటు, మధుమేహం, గర్భషాయ, రొమ్ము, నోటి క్యాన్సర్ వంటి వైద్యపరీక్షలు నిర్వహించారు అనంతరం గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్త లు, పాలిచ్చే తల్లులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. 30సంవ రాలు దాటిన ప్రతి ఒక్కరు రొమ్ము క్యాన్సర్, గర్భస్థ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు అలాగే చిన్నారుల్లో సికిల్ సెల్ అనిమియా గుర్తించే పరీక్షలు,క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు,చిన్నారులకు, గర్భిణీలకు వ్యాధి నిరోధక టీకాలు, ఆయుష్ సేవలు,వయోవృద్దులకు ఆరోగ్యపరీక్షలు, పోషణ అభియాన్, తల్లీబిడ్డల సేవల, రక్తదానలా శిభిరాల నిర్వహణ ప్రకధానమంత్రి మాతృ వందన యోజన మొదలగు కార్యక్రమాలు వచ్చేనెల 2వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు ఈ కార్యక్రమం లో 104స్పెషల్ ఆఫీసర్ జగదీష్ చంద్రారెడ్డి, ఆర్ బి ఎస్ కే ప్రోగ్రాం డాక్టర్ కాంతారావు నాయక్, ప్రాథమిక వైద్యకేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వెంకటశివ డాక్టర్, మహమ్మద్ రూహుల్ళాఖాన్, సి హెచ్ ఓ రవికుమార్, సూపర్ వైజర్ సాయికృప, ప్రభాకరమ్మా,హెల్త్ సిబ్బంది, ఎం ఎల్ హెచ్ పి లు, ఏ ఎన్ ఎం లు, ఆశాలు అంగన్వాడీ టీచర్స్, మహిళలు, గర్భవతులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# సబ్ కోర్టు స్థలాన్ని జిల్లా జడ్జి పరిశీలన

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** పత్తికొండ పట్టణంలో జూనియర్ సబ్ కోర్టుకు చెందిన స్థలాన్ని జిల్లా జడ్జి కపర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు లీలా వెంకట శేషాద్రి పత్తికొండ పట్టణంలో ఉన్న కోర్టు స్థలాన్ని పరిశీలించారు. గురువారం పత్తికొండ పట్టణంలోని ముస్రోబావి ప్రక్కన ఉన్న జూనియర్ సబ్ కోర్టు స్థలాన్ని జిల్లా జడ్జి పరిశీలించారు. అలాగే పట్టణంలోని జూనియర్ సబ్ కోర్టును, కోర్టులో


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి

జరుగుతున్న మౌళిక సదుపాయాలను, టాయ్‌లైట్ల పనులు ఎంతవరకు జరుగుతున్నాయని పరిశీలించారు. అనంతరం సబ్ జైలును సందర్శించి ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోర్టు భవనం నిర్మాణం మొదలు పెట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ సివిల్ జడ్జి జోష్నాదేవి, ఆర్డీఓ భరత్ నాయక్, తహశీల్దార్‌హుసేన్ సాబ్, పత్తికొండ బార్ అసొసియేషన్ అధ్యక్షులు మధుబాబు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లు లేని కుటుంబానికి సొంతింటి కల సాకారంకు పీఎం ఆవాస్ యోజన

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాఈ అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 అంగీకార్-2025 బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆవిష్కరించారు. గురువారం తన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ శేషన్న, హౌసింగ్ పిడి శ్రీహరి గోపాల్‌తో పాటు కలిసి అంగీకార్ బ్రోచర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు లేని ప్రతి అర్హత గల కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక ఆధార్, రేషన్‌కార్డు కలిగి ఎన్‌బిఎం పోర్టల్‌లో అర్హులుగా గుర్తింపు పొందిన వారికి పీఎంఏవై, ఎన్‌టిఆర్ నగర్ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.5లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కలిపి రూ.2.5లక్షలు సబ్సిడీ అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 4న ఢిల్లీలో జాతీయ స్థాయిలో ఈకార్యక్రమాన్ని ప్రారంభింభించి సంవత్సరం పూర్తయిన సందర్భంలో సెప్టెంబర్-అక్టోబర్ నెలలను హౌసింగ్ నెలలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఇళ్లు లేని పేదలను గుర్తించి గృహ యజమానులుగా చేయడం, బ్యాంక్ లోన్ సౌకర్యం కల్పించడం, రిజిస్ట్రేషన్ చేయించడం, పీఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజనలో లబ్ధిదారులను ప్రోత్సహించడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ప్రధాన అంశాలుగా కొనసాగనున్నాయని కలెక్టర్ వివరించారు.




## జలమయమైన పడకండ్ల .. యుద్ధ ప్రాతిపదికన అధికారుల చర్యలు


పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

**ఆళ్లగడ్డ, మేజర్‌న్యూస్ :** ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామ శివారులలో గురువారం కురిసిన భారీవర్షానికి అహోబిలం వెళ్లే రోడ్డు జలమయంగా మారింది. కాలువలలో నిండిపోయి రోడ్డు ఎక్కి ప్రవహించింది. దీనితో రెండు వైపులా రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ తహసిల్దార్‌జ్యోతిరత్నకుమారి, డి.ఎస్.పి ప్రమోద్, టౌన్ సీఐ యుగంధర్, మున్సిపల్ కమిషనర్ కిషోర్ తదితర అధికారుల బృందం వెంటనే ఘటన స్థలాన్ని సందర్శించి నీటిని క్లియర్ చేయించారు. దీనితో రాకపోకలకు మార్గం సుగమం అయింది. ఓబులంపల్లి రస్తాలో ఒక వ్యక్తి అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను అధికారులు కూల్చివేశారు.

## పశువైద్య కేంద్రాలలో ఆకస్మిక తనిఖీ

**పాములపాడు,మేజర్‌న్యూస్ :** పాములపాడు, మిట్టకందాల పశువైద్య కేంద్రాలను సహాయక సంచాలకులు వెలుగోడు డాక్టర్ వెంకటేశ్వర్లు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం మండలంలో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకి గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయాలని రైతులకు సూచించారు.అలాగే కోళ్లలోవచ్చే కొక్కెర తెగులు నివారణకు ప్రతి బుధవారం టీకాలు వేయించుకోవాలని సూచించారు. రైతులు 75% సబ్సీడీతో అందుతున్న గడ్డి జొన్నలు, 90% పేయ్యదూడల సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. పాల ఉత్పత్తి పెంచేందుకు పశుసంవర్ధక శాఖ అందిస్తున్న మినీ గోకులాలు, వ్యాధి నివారణ టీకాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.పశువైద్య అధికారి డా. భాస్కర్, సిబ్బంది స్వాతి, తిరుమలేష్, కవిత, గోపాలమిత్ర మున్వర్ భాష పాల్గొన్నారు.




## దసరా శర్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం


బి.సి ఇందిరమ్మను ఆహ్వానిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్:** దసరా శరన్నవరాత్రి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బనగానపల్లె పట్టణంలోని కొత్తపేటలో వెలిసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శరన్నవరాత్రి ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మను ఆర్యవైశ్య సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. అలాగే బనగానపల్లె మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డిని శాల్వతో సత్కరించి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని ఆర్యవైశ్య సంఘం పెద్దలు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరు శీనయ్య, ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ గాధంశెట్టి వేణుగోపాల్, సెక్రెటరీ శ్రీరామ వెంకటసుబ్రమణ్యం, సాయిరాం, సాగర్, భరతుడు, జంగంశెట్టి, తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## కోటపాడు గ్రామంలో స్వచ్ఛ భారత్

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామంలో తెలుగు దేశం పార్టీ గ్రామ కమిటీ సూచన మేరకు పంచాయితీ సెక్రెటరీ, సచివాలయ సిబ్బంది గ్రామంలో ఉన్న ఇద్దరు "స్వచ్ఛ భారత్" కార్మికుల (గ్రీన్ అంబాసిడర్స్)ను వెంట బెట్టుకొని గ్రామములోని వీధుల వెంబడి తిరిగి మురుగు కాలువల్ని పరిశుభ్రం చేయిస్తూ మరియు రోడ్ల వెంబడి వేసిన చెత్త చెదారంను తొలగించారు.


చెత్తాచెదారంను శుభ్రం చేస్తున్న గ్రీన్ అంబాసిడర్స్

## ఆటో - బోలేరో ఢీ ..వ్యక్తి మృతి.. పలువురికి గాయాలు


మృతి చెందిన నులక రాముడు

**అవుకుమేజర్,న్యూస్:** రామాపురం నుండి ప్రయాణికులను ఎక్కించుకొని వస్తున్న ఆటోను పాతచెర్లోపల్లె వద్ద తాడిపత్రికి వెలుతున్న లోలేరో వాహనం డీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందడం పలువురికి గాయాలు అయ్యాయి. చెర్లోపల్లె గ్రామానికి చెందిన నులక రాముడు (65) అక్కడికక్కడే మృతి చెందగా ఆనంద శర్మ మరి ఒకరికి తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి ఆటో డ్రైవర్‌కు ఐన గాయాలకు అవుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రథమ చికిత్స చేసి పంపివేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్.ఐ రాజారెడ్డి తెలిపారు. మరణించిన నులక రాముడి శవానికి పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పజెప్పినట్లుగా పోలీసులు తెలిపారు. **దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి బి.సి :** రోడ్డు ప్రమాదంలో 7గురు గాయాలపాలై ఒకరు మృతి చెందడంపై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి సత్వర మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

# వైకాపా ఛలో మెడికల్ కాలేజ్ కి అనుమతి లేదు..డీఎస్పీ



డి.ఎస్.పి ప్రమోద్ కుమార్

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** వైకాపా నేడు తలపెట్టిన చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమానికి పోలీసుల అనుమతి లేదని ఆళ్లగడ్డ డి.ఎస్.పిప్రమోద్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనమాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైకాపా విద్యార్థి యువజన విభాగాలతో కలిసి శుక్రవారం తలపెట్టిన చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమానికి పోలీసుల నుండి ఎలాంటి అనుమతులు లేవన్నారు. నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి మరియు రెండవ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయని వైకాపా చేపట్టిన ఆందోళన కార్యక్రమం వల్ల పరీక్షల నిర్వహణకు అంతరాయం కలిగే అవకాశం ఉందని విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. నంద్యాల మెడికల్ కళాశాల వద్ద ఏ విధమైన సమావేశాలకు అనుమతులు ఇవ్వలేదని ఆళ్లగడ్డ డిఎస్పి కార్యాలయం ప్రకటనలో తెలిపింది.

# కూలిన మట్టిమిద్దె..తప్పిన పెను ప్రమాదం



కూలిన మట్టిమిద్దె

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని 1వ వార్డులో నివాసం ఉంటున్న కుమ్మరి విజయలక్ష్మి, పరశురాముడు దంపతులకు చెందిన పురాతన మట్టిమిద్దె అధిక వర్షాలకు గురువారం మధ్యాహ్న సమయంలో కూలింది. మట్టిమిద్దె కూలిన సమయంలో ఇంట్లో వాళ్ళు ఇంటి బయట ఉండడంతో ప్రమాదం తప్పింది. తమకు ఇళ్ళు మంజూరు చేయాలని చాలా కాలంగా వేడుకుంటున్న ఏ ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న ఇళ్ళు పడిపోవడంతో కుటుంబ సభ్యులమంతా రోడ్డున పడ్డామని వాపోయారు. నిత్యవసర వస్తువులు మట్టిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆకస్మిక తనిఖీ

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థకార్యదర్శికాటంప్రకాష్ నంద్యాల స్థానిక పద్మావతీనగర్‌లో గల పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంథాలయంలో చదువుకుంటున్న పాఠకులని గ్రంథాలయములో మౌళిక వసతులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భముగా పాఠకులు ,కార్యదర్శి కాటం ప్రకాష్ ను చదువుకునేందుకు ప్రత్యేక స్టడీహాల్ మరియు పోటీ పరీక్షలకు సంబంధించిన కొత్త పుస్తకాలు అందుబాటులో వుంచాలని కోరారు. దీనికి వారు త్వరలో తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు మరియు గ్రంథాలయ నిర్వహణ, సిబ్బంది సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఆర్.ఇ.శ్రీధర్, పాఠకులు వెంకటేశ్వర్లు, రవి, ఆదినారాయణ, శ్రీనివాసులు,లక్ష్మన్న, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అంతరిక్ష విజయాల వేడుక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతరిక్ష విప్లవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ లలిత మాట్లాడుతూ భారత దేశంలో అంతరిక్ష విజ్ఞానం పూర్వం నుంచి అభివృద్ధి చెందుతూ వచ్చిందని పూర్వ ఖగోళ శాస్త్రజ్ఞులు ఆకాలంలోనే గ్రహ, నక్షత్రాల గమనాలను , దూరాలను లెక్కించగలిగారని ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎన్నో గొప్ప విజయాలను సాధించిందని ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని అంతరిక్ష విప్లవ దినోత్సవం జరుపుకోవడం గర్వకారణమన్నారు. విద్యార్థులు కూడా ఈ విజయాల నుంచి ప్రేరణ పొంది శాస్త్రీయ ఆలోచన సృజనాత్మకత కష్టపడే స్వభావాన్ని అలవర్చుకోవాలని రేపటి రోజుల్లో విద్యార్థులు శాస్త్రవేత్తలు ఇంజనీర్లు పరిశోధకులుగా దేశానికి సేవ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఎన్. ఉమామహేశ్వర రెడ్డి, మహమ్మద్ గౌస్, బడేసాహెబ్, రామకృష్ణ , సుధాకర్ రెడ్డి, వసుంధరమ్మ, కౌసల్యాదేవి, రవికుమార్, ఫాతిమా, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఎర్రమట్టి గ్రావెల్ తరలింపు

**-ఉక్కుపాదం మోపిన పోలీసులు**

**-నాలుగు ట్రాక్టర్లు..ఒక జెసీబీ స్వాధీనం.. కేసు నమోదు**

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడబూరు మండలపరిధిలోని కల్లుకుంట గ్రామానికి సమీపంలో ఉన్న కొండగొట్టులో గురువారం అదేగ్రామానికి చెందిన వ్యక్తులు ఎర్రమట్టి గ్రావెల్ ను ట్రాక్టర్లుతో అక్రమంగా తరలిస్తూ అధికంగా సోమ్ము చేసుకుంటున్నారన్న సమాచారం అందుకున్న పెద్దకడుబూరు పోలీసులు వారిపై దాడి చేసి అందులో ఒక జెసిబీతో పాటు నాలుగుట్రాక్టర్లును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి మండల తహశీల్దార్ కు సిఫార్సు చేయడం జరిగిందని పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్ కుమార్ రెడ్డి విలేకరులకు తెలిపారు. అలాగే ఎవరైనా మీ గ్రామ పరిధిలో ఉన్న గ్రెవెల్. ఇసుకను అక్రమంగా తరలిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని. అంతేకాకుండా కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

# 120 రోజుల తరువాతనే ఉల్లిపంటను కోత కోయాలి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ఉల్లిపంటను సాగు చేసిన రైతులు సాగు చేసిననాటి నుంచి 120 రోజుల పూర్తి అయిన తరువాతనే పంటను కోత కోయాలని జిల్లా ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు కృషవర్ధన్రెడ్డి, ఏడీఏ మహమ్మద్ఖ్రాద్రీ కోరారు. గురువారం మండల పరిధిలోని నెరుడుప్పల, పిల్లిగుండ్ల గ్రామాలలోని ఉల్లి సాగు చేసిన పొలాలలోజిల్లా ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు కృష్ణవర్ధన్రెడ్డి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, తహసీల్దార్ రాజేశ్వరి, ఏవో హైమలత, సిబ్బంది పర్యటించారు. రైతులతో మాట్లాడారు. ఉల్లి సాగు చేసిన వంటపొలాలను ఉల్లి పంటను కోసిన రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతాలలోని ఉల్లి రైతులకు అనుకూలంగా ఉండేందుకు గాను ఏవి. మగనూరులో ఉల్లి మార్కెట్ ఏర్పాటు చేశారని తెలిపారు. గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తీసుకువెలితో క్వింటం రూ.1200 పలుకుతుందని చిన్నగడ్డలు, పెద్దగడ్డలు వేరుచేయలని కోరారు. అలాగే సాగు చేసిన ప్రతి ఎకరంను పంట నమోదు చేయాలని సిబ్బంది ఆదేశించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది నరసప్ప, పులిరాజు, అరుణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.



కొతకాసిన ఉల్లి పంట రైతుతో మాట్లాడుతున్న అధికారులు

# దేశ సంపదను దోచిపెడుతున్న బీజేపీ

**-కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు అనంతరత్నం మాదిగ**




**సి.బెళగల్ , మేజర్ న్యూస్:** దేశ సంపద బిలినియర్లకు అండ కాచి దోచిపెడుతున్నారని కోడుమూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అనంత రత్నం మాదిగ అన్నారు.మండలంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకన్న ఆధ్వర్యంలో బీజేపీ పార్టీకి వ్యతిరేకంగా ప్రజాసంతకాల సేకరణ చేపట్టారు.ఈకార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా కోడుమూరు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ అనంత రత్నం మాదిగ మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ సాంబశివుడు,కాంగ్రెస్ పార్టీ కర్నూల్ మండల అధ్యక్షురాలు బి.హైమావతి పాల్గొని ప్రజలతో సంతకాలు సేకరించారు. అనంతరం ఈసందర్భంగా కోడుమూరు అసెంబ్లీ ఇన్చార్జి అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీదొంగ ఓట్లతో గద్దెనెక్కి మన దేశ సంపదను ఆదాని,అంబానిలకు దోచిపెడుతున్నారన్నారు. అదే విదంగా దేశంలో ఉన్న పరిశ్రమలను ప్రైవేటు ఫారం చేస్తున్నాడు, కావున మోడీ హటావో దేశంకు బచావో అంటూ మనమందరం నినాదించి రాబోయే ఎలక్షన్ల నందు కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని దేశ అభివృద్ధికి సహకరించుకోవాలని మాట్లాడారు. ఎద్దుల త్యాగరాజు మాదిగ,ఏ లలితమ్మ,మాదిగకిషోర్,కంపాడుజయన్న తదితర నాయకులు కార్యకర్తల పాల్గొన్నారు.

## కోర్టు భవన నిర్మాణ సముదాయం పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** ఎమ్మిగనూరు నూతన కోర్టు భవన నిర్మాణ సముదాయం కోసం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది బుధవారం పరిశీలించారు. టీబిపి కాలనీలోనిఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ప్రక్కన ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అక్కడ కోర్టు నిర్మాణానికి అన్ని సౌకర్యాలు ఉండటంతో ఆయన స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు భవన నిర్మాణం కోసం అన్ని అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణం చేపడతాం అని అయన న్యాయవాదులకు హామీ ఇచ్చారు. ఈ స్థల పరిశీలనలో జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ బి.లీలా వెంకట శేషాద్రి, ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రషీద్, న్యాయవాదులు మురళీకృష్ణ, రామక్రిష్ణ నాయుడు, లింగమూర్తి, ప్రసాద్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

## 17వ తేదీ నుండి అక్టోబరు 16వ తేదీ వరకు పోషణమాసం..అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌: తల్లులకు, పిల్లలకు ఉబకాయం తగ్గించాలని ఈనెల 17వ తేది నుండి 2025 అక్టోబర్ 16వ తేది వరకు పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని వెల్దుర్తి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ రామళ్ళకోట సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి, సూపర్‌వైజర్ సరస్వతీలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని రామళ్ళకోట సెక్టార్‌లోని 4 అంగన్‌వాడి కేంద్రాలకు సంబంధించి సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో, అదేవిధంగా మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె, శ్రీరంగాపురం ఆరోగ్య కేంద్రాలలో సూపర్‌వైజర్ సరస్వతీ ఆధ్వర్యంలో గురువారం పోషణమాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా కార్యక్రమాల్లో మాట్లాడుతూ తల్లులకు ఇచ్చేటువంటి మెనులను ప్రదర్శించడం, చిరుధాన్యాలతో రాగులు, సద్దలు, నువ్వులు, జొన్నలు, కందులు, పెసర్లు, కొర్రలు, అలసందలను తినాలని, నూనెలు, జంక్ ఫుడ్స్, కుర్‌కురేలు, గోబీలు, నూడిల్స్ మొదలకు వాటిని తినకూడదని తల్లులకు తెలియజేశారు. వంట చేయకముందు, వంట చేసిన తరువాత భోజనానికి ముందు, భోజనం తరువాత చేతులను శుభ్రం చేసుకోవాలని, ప్రతి భోజనంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. కావున పిల్లల తల్లులు ఎంతో జాగ్రత్తగా పిల్లల ఎదుగుదలను గుర్తించుకొని పోషకాలు కలిగిన ఆహారాన్ని తినాలని, పిల్లలకు కూడా తినిపించాలని సూచించారు. అలాగే అంగన్‌వాడి టీచర్లు సైతం వారి ఆరోగ్య భద్రతలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తల్లి, పిల్లల ఆరోగ్య వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో మహిళా సంరక్షణ కార్యదర్శి ఏ.లక్ష్మిప్రసన్న, గర్భవతులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలు, తల్లులు, శ్రీరంగాపురంలో ఎంఎస్‌కె, అంగన్‌వాడి టీచర్లు పద్మావతి, మాణిక్యమ్మ, హెల్పర్లు, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.



రామళ్ళకోట గ్రామంలో పోషణమాసం కార్యక్రమం

## గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలి..-డిఎంహెచ్ఓ శాంతికళ

**సి.బెళగల్ , మేజర్ న్యూస్:** మండలంలో డెంగీ, మలేరియా కేసులు అధికంగా నమోదు అవుతున్నాయని క్షేత్ర స్థాయిలో నుండె డెంగీ, మలేరియా కేసులను అరికట్టి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలనీ డిఎంహెచ్ఓ శాంతికళ సూచించారు. గురువారం మండలంలో బెళగల్,పోలకల్ పిహెచ్సిలను తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ పలు రికార్డులను పరిశీలించి స్టాఫ్,పిహెచ్సిలో నిర్వహిస్తున్న వైద్యాసేవలు,వైద్యుల గురించి వైద్యులనడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రభలి డెంగీ, మలేరియా కేసులు అధిక సంఖ్యలో నమోదు అవుతున్నాయని, అందుకు తగిన జాగ్రత్తలు,సలహాలు, సూచనలు ప్రజలకు సూచించాలన్నారు. వైద్యసిబ్బంది గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంక్ లను ఎప్పటికప్పుడు శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ కలిపిన శుద్ధి చేసిన నీటిని ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు నీటిని టెస్ట్ చేయించాలని సూచించారు.నివాస పరిసరాలను వాడ పరిసరాలను పారిశుధ్యం పనులను ఎప్పటికప్పుడు నిర్వహించే విధంగా చర్యలు తీసుకొని సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేసి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు,సూచనలు అందించాలని డిఎంహెచ్ఓ శాంతికళ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నూకయ్య, పోలకల్, బెళగల్ వైద్యులు, హనీఫ్,మిథున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువలా ఎమ్మెల్యే కోట్ల జన్మదిన వేడుకలు

**- భారీ ర్యాలీ.. తరలివచ్చిన తెలుగు తమ్ముళ్ళు**



ర్యాలీకి తరలివచ్చిన తెలుగుతమ్ముళ్ళు



టిడిపి నాయకుల సమక్షంలో కేక్‌ను కట్ చేస్తున్న యువనేత కోట్ల రాఘవేంద్రారెడ్డి

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల తెలుగు తమ్ముళ్ళు కన్నుల పండుగలా నిర్వహించారు. గురువారం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన కుమారుడు కోట్ల రాఘవేంద్రారెడ్డి ప్యాపిలి మండల కేంద్రానికి వస్తున్నారన్న సమాచారం అందుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ప్యాపిలి పట్టణానికి సమీపంలో ఉన్న 44వ నెంబర్ జాతీయ రహదారికి భారీ ర్యాలీతో చేరుకొని యువనేత కోట్ల రాఘవేంద్రారెడ్డికి ఘన స్వాగతం పలుకుతూ, పట్టణంలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఎదురుగా ఉన్న మాజీ ముఖ్య మంత్రివర్యులు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి విగ్రహానికి యువనేత కోట్ల రాఘవేంద్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆర్టీసి బస్టాండ్ కూడలీలో ఏర్పాటు చేసిన భారీ కేక్ కటింగ్ కార్యక్రమంలో యువనేత కోట్లరాఘవేంద్రారెడ్డి పాల్గొని అభిమానుల మద్య కేక్‌నుక ట్ చేసి, కేక్‌ను తెలుగుతమ్ముళ్ళకు అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ప్యాపిలి మండల టిడిపి ఇంచార్జ్ ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు ఖాజాపీరా, నాయకులు గడ్డం అంకిరెడ్డి, బత్తుల రమేష్‌రెడ్డి, ఆర్‌ఈ.నాగరాజు, కొంగనపల్లె మధు, చల్లా వీరాంజినేయులు, నడిగడ్డ నాగేంద్ర, మెట్టుపల్లి సుదర్శన్, పెద్దపూదిళ్ళ ప్రసాద్‌రెడ్డి, చిన్నపూదిళ్ళ పుల్లాసి దస్తగిరి, రమేష్‌గౌడ్, ప్రిన్సిపాల్ మధు, శ్రీకాంత్‌నాయుడు, గుడిపాడు వెంకటరెడ్డి, ధానం మధు, రామ్మోహన్‌యాదవ్, చల్లా అనుదీప్, ఎస్‌కె. వలి, బ్యాంక్ శీను, వార్డు మెంబర్ వెంకటేష్, గండికోట రమేష్, మాధవరం రాము, నల్లమేకలపల్లె సత్యం, రాజశేఖర్‌నాయుడు, గండికోట పెద్దరామాంజి, బర్మా శ్రీధర్, ఆర్‌ఎంపి రామ్‌మోహన్, గార్లదిన్నె సుధాకర్, బోయిన్‌చెరువుపల్లె కాంతారావు, జక్కసానికుంట్ల ఆదిరెడ్డి, జయరామయ్య, మహేష్‌యాదవ్, లాల్‌రెడ్డి, రాచర్ల కృష్ణారెడ్డి, శ్రీరాములు, బీజేపి నాయకులు దామోదర్‌నాయుడు, కేసి.మద్దిలేటి, హుస్సేనాపురం చంద్రశేఖర్, పెద్దపూదిళ్ళ ఓబులేసు, కార్యకర్తలు, కోట్ల అభిమానులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో దసరా మహోత్సవాలకు సీఎంకు ఆహ్వాన పత్రిక అందచేత



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల క్షేత్రంలో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం అమరావతిలోని సీఎం కార్యాలయంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ఫరూక్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఈవో శ్రీనివాసరావు,వేద పండితులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈసందర్భంగా సీఎంకు శేష వస్త్రాలు,ప్రసాదాలు, శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. అలాగే రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కూడా కలిసి దసరా మహోత్సవాలకు ఆహ్వానించారు.



# మా ప్రాంతంలో బార్ అండ్ రెస్టారెంట్ వద్దు



**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** స్థానిక మౌలానా అజాద్ సర్కిల్ సెంటర్‌లో బార్ అండ్ రెస్టారెంట్‌లు వద్దని మౌలానా ఆజాద్ సర్కిల్ వాసులు, సలీంనగర్ వాసులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతంలో స్వాతంత్ర సమరయోధుదు మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరున ఉన్న ఏకైక ప్రాంతమని, ఇక్కడ ఎటువంటి అసాంఘిక కార్యక్ర మాలు లేకుండా శాంతి నెలకొని ఉన్నదని అన్నారు. ఇది నివాస ప్రాంతమని, ఇక్కడ అపార్ట్‌మెంట్లు,స్కూళ్లు, హాస్పిటళ్లు,బ్యాంకులు, హోటళ్లు ఉన్న ప్రాంతమని అన్నారు. ఇక్కడ 10గంటల నుంచి ఉదయం వరకు సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణీకులు చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు సేఫ్టీ ప్రాంతమని, ఇక్కడ బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతవాసులకు, ప్రయా ణీకులకు ప్రశాంతత భగం కలిగే ప్రమాదముందని వారు తెలిపారు. ఏలాంటి బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయడానికి వీలులేదని, లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్‌ను, జిల్లా ఎక్సైజ్ అధికారులను, మున్సిపల్ కమీషనర్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చింపింగ్ బాసిత్, కార్పెంటర్ మౌలాలి, మౌలానా రహమతుల్లా, సర్దార్, అబులైస్, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

## కోట్ల జన్మదినం సందర్భంగా అన్నదానం



విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, రామ్మోహన్‌యాదవ్, నాయకులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** డోన్ నియోజకవర్గం శాసనసభ్యులు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ప్యాపిలి మెయిన్ స్కూల్ నందు మాజీ ఎంపిటిసి రామ్మోహన్‌యాదవ్ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్యాపిలి మండల ఇంచార్జ్ ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు గడ్డం అంకిరెడ్డి, ఖాజా పీరా, గండికోట పెద్ద రామాంజినేయులు, గొల్ల రామ్మోహన్‌యాదవ్, జక్క సానికుంట్ల మహేష్‌యాదవ్, ఉపాధ్యాయులు నరసింహ పాల్గొన్నారు.

# ఉయ్యాలవాడ మండలంలో కుండపోత వర్షం

**- కేవలం అరగంటలో ఒక సెంటీమీటర్ వర్షపాతం నమోదు**

**- హరివరం ఎస్సీ కాలనీని చుట్టూముట్టిన వరద నీరు**

**- నంద్యాల ఎంపీ శబరికి సమాచారం ఇచ్చిన కాలనీ వాసులు**



కాలనీలో పర్యటిస్తున్న భూమా విఖ్యాత్‌రెడ్డి



వరద నీటిలో పర్యటిస్తున్న ఎస్ఐ, తహసీల్దార్



బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** ఉయ్యాలవాడ మండలంలో గురువారం తెల్లవారు జామున 4 గంటల నుంచి 6 గంటల వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. అయితే ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు కేవలం అరగంట వ్యవధిలోనే కుండపోత వర్షం కురిసింది. మొత్తం మీద 3 గంటల వ్యవధిలోనే 127.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ శాఖ అధికారులు తెలిపారు. ఈ కారణంగా మండల కేంద్రమైన ఉయ్యాలవాడతో పాటు హరివరం, సర్వాయిపల్లె, ఆర్ పాంపల్లె గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హరివరం గ్రామ ఎస్సీ కాలనీలోకి వర్షపు నీరు ఉధృతంగా రావడంతో కాలనీవాసులు భయాందోళనలు చెందారు. నంద్యాల ఎంపీ శబరికి వీడియో కాల్ ద్వారా కాలనీ వాసులు సమాచారం ఇచ్చారు. ఇందుకు ఎంపీ శబరి వెంటనే స్పందించి తహసీల్దార్ ప్రసాద్‌బాబు, ఎస్ఐ రామిరెడ్డి, వీఆర్వో గోపాల్ నాయుడు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావులు హుటాహుటిన హరివరం ఎస్సీ కాలనీకి తరలి వెళ్ళారు. వరద నీటిలోనే కాలనీ అంతట తిరిగి కాలనీ వాసులకు ధైర్యం చెప్పారు. నిత్యావసర వస్తువులు వర్షపు నీటితో తడిసిపోయిన ఐదు కుటుంబాల వారికి బియ్యం, పంచదార, కందిపప్పు, తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఇదే సమయంలో ఆళ్ళగడ్డ తాలుకా తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి గ్రామానికి చేరుకొని కాలనీలో పర్యటించి ప్రజలను పరామర్శించారు. పంపాల్లె గ్రామంలో లోలెవెల్ బ్రిడ్జి పూర్తిగా మునిగిపోయింది. ఇంజేడు గ్రామం వద్ద కుందర వాగు ఉప్పొంగి ప్రవహించడంతో ఆళ్ళగడ్డ - మాయలూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కారణంగా విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలకు విద్యాశాఖ మండలంలో సెలవు ప్రకటించింది.



## మెడికల్ కళాశాలకు టెండర్లు పిలవడం ఏమిటి..?

**- వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి**

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ ః** రాష్ట్రంలోని పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె మెడికల్ కళాశాలలను పిపిపికి టెండర్లు పిలవడం ఏమిటని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కలాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. ప్రైవేటు పరం చేయొద్దని ప్రజలు, విద్యార్థులు, ప్రతిపక్ష పార్టీ ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. పిపిపి విధానం ద్వారా ప్రభుత్వ సొమ్మును ప్రైవేటు వ్యక్తులతో కలిసి చంద్రబాబు దోచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ఈ నెల 19న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదోని మెడికల్ కళాశాల వద్ద ఆందోళన చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.




మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి